www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 14 | ఫిబ్రవరి | 2026
పేజీలు : 7

## మేయర్ పీఠం సిపిఐదే..




-ఇది ప్రజా విజయం
-కలిసొచ్చే వారిని కలుపుకుపోతాం
-మీడియా సమావేశంలో కూనంనేని

2లో..

# నల్ల నేలన ఎర్రజెండా రెపరెపలు

-సత్తా చాటిన కంకి కొడవలి
-కూనంనేని వెంటే కొత్తగూడెం ప్రజలు





**ప్రజాపక్షం/ఖమ్మం/కొత్తగూడెం :** నల్లనేలపై మరోమారు ఎర్ర జెండా రెపరెపలాడింది. కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ తన సత్తా ఏమిటో మరోమారు చూపింది. నిన్న మొన్నటి వరకు మేము లేకుంటే మీకు గెలుపు లేదు అని తెర వెనుక ప్రచారం చేసిన వారికి కొత్తగూడెం కార్పోరేషన్ ఓటర్లు తగు రీతిలో సమాధానమిచ్చారు. సిపిఐ వైపే మేము న్నామంటూ 22 స్థానాల్లో సిపిఐని గెలిపించడంతో పాటు మరో రెండు స్థానాల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించారు. సిపిఐకి ఉన్న బల మైన పునాది శాసన సభ్యునిగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చేస్తున్న అభివృద్ధి, ప్రజా సమస్యల కోసం పార్టీ చేస్తున్న పోరాటాలు వెరసి సిపిఐ మేయర్ పీఠాన్ని అధిష్టించబోతుంది. ధనాహం కారం , అధికార అహంకారానికి కాలం చెల్లిందని ప్రజల మధ్య నిలిచే వారికే పట్టం కడతామని కొత్తగూడెం ప్రజలు తేల్చి చెప్పారు. శుక్రవారం జరిగిన ఓట్ల లెక్కింపులో సిపిఐ 22 స్థానాల్లో విజయం సాధించి అధికార పార్టీకి ధీటుగా నిలిచింది. అధికార కాంగ్రెస్ అండ బలాన్ని, బంధు బలాన్ని, ధన బలాన్ని ప్రదర్శించిన

మిగతా 2లో..

## నాలుగు స్థానాల్లో సిపిఐ అభ్యర్థుల విజయం










**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం జిల్లాలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు శుక్రవారం జరిగింది. ఏదులాపురం మున్సిపాలిటీలో మూడు స్థానాల్లో, వైరా మున్సిపాలిటీలోని 15వ వార్డులో సిపిఐ విజయం సాధించాయి. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు నుంచి నల్లమోతు శైలజ విజయం సాధించారు. ఇక్కడ అధికార పార్టీ తన దందాను ఉపయోగించి రెండు సార్లు రీ కౌంటింగ్ నిర్వహించి సిపిఐ అభ్యర్థి విజయాన్ని అడ్డుకోవాలని ప్రయత్నించారు. రీ కౌంటింగ్ నిర్వహించిన ప్రతిసారి సిపిఐ అభ్యర్థికి ఓట్లు పెరుగుతూ రావడం గమనార్హం. ఏదులాపురం మున్సిపాలిటీలోని 32, 30, 28 వార్డుల్లో సిపిఐ విజయం సాధించింది. 28వ వార్డు నుంచి సిపిఐ నాయకులు దండి రంగారావు, 32వ వార్డు నుంచి ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, 30వ వార్డు నుంచి యువ న్యాయవాది, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కుమార్తె దండి శ్రీజ విజయం సాధించారు. సిపిఐ విజయాన్ని అడ్డుకునేందుకు ఇక్కడ అపవిత్ర పొత్తులు పెట్టుకున్నారు. ప్రత్యక్షంగానో పరోక్షంగానో సిపిఐని ఓడించేందుకు సిపిఎం, బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేతులు కలిపాయి. అయినా సిపిఐ అభ్యర్థులు విజయం సాధించడం గమనార్హం. మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించిన ఓటర్లకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఆయా ఏరియాల సిపిఐ బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసిన ఓటర్లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేసినందుకు అభినందనలు తెలియజేశారు.

## మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ ఏకపక్ష విజయం




**ప్రజాపక్షం/ఖమ్మం:** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏకపక్ష విజయాలను సాధించింది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఏడు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగగా ఏడింటిని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరలో కాంగ్రెస్, టిడిపి ఫ్రంట్ అద్భుత విజయం సాధించి

మిగతా 2లో..

-కల్లూరు, వైరాలో గట్టి పోటీనిచ్చిన బిఆర్‌ఎస్ ఫ్రంట్
-మధిర, అశ్వారావుపేట, ఇల్లందులో కనీస పోటీ ఇవ్వలేకపోయిన బిఆర్‌ఎస్
-గౌరవ ప్రధమైన స్థానంలో సిపిఐ

# మేయర్ పీఠం సిపిఐదే..

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ సాధించిన విజయం ప్రజలు, కార్మికుల విజయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. 22 డివిజన్లలో విజయం సాధించామని ఆయన తెలిపారు. సిపిఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ హోరాహోరీగా సాగిన కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో సిపిఐకి అపూర్వ విజయాన్ని అందించారని కొత్తగూడెం కార్పొరేషన్ తొలి మేయర్ స్థానాన్ని సిపిఐ దక్కించుకుంటుందన్నారు. తమతో కలిసి వచ్చే వారిని కలుపుకుపోతామని మద్దతు విషయంలో పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రచారంలోనూ ఎక్కడ ఎవరిని విమర్శించకుండా ముందుకు సాగామని తమకు ప్రజలు అడుగడుగునా ఆదరాభిమానాలు చూపించారని కూనంనేని తెలిపారు. కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు బాధ్యతను మరింతగా పెంచాయని ప్రజల పక్షాన పనిచేసేందుకు సిపిఐ పునరంకితమవుతుందన్నారు. గడిచిన రెండేళ్లుగా సిపిఐ చేసిన అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ చేసిన కృషి ఈ విజయానికి కారణమని కూనంనేని తెలిపారు. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, నాయకులు ప్రసాద్, రత్నాకర్ పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ ఏకపక్ష విజయం

**(మొదటిపేజీ తరువాయి)**

మధిర మున్సిపాలిటీని తొలిసారి కైవసం చేసుకుంది. 22 స్థానాలకు గాను కాంగ్రెస్ ఫ్రంట్ 21 స్థానాల్లో విజయం సాధించింది. 18లో కాంగ్రెస్, మూడింటిలో టిడిపి పార్టీ విజయం సాధించగా కేవలం ఒక స్థానానికే బిఆర్ఎస్ పరిమితమైంది. కల్లూరులో బిఆర్ఎస్ కాంగ్రెస్‌కు గట్టి పోటీనిచ్చింది. ఇక్కడ 13 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. వైరాలోనూ బిఆర్ఎస్ ఫ్రంట్ కాంగ్రెస్‌కు గట్టి పోటీనిచ్చింది. ఇక్కడ మొత్తం 20 స్థానాలు ఉండగా బిఆర్ఎస్ ఐదు, సిపిఎం ఒకటి, సిపిఐ ఒకటి, 12 స్థానాల్లో కాంగ్రెస్, ఒక స్థానంలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. అశ్వారావుపేట మున్సిపాలిటీలో ఏకపక్ష ఓటింగ్ జరిగింది. ఇక్కడ గట్టి పోటీ ఇస్తుందనుకున్న బిఆర్ఎస్ చివరి దశలో నిలబడలేకపోయింది. అశ్వారావుపేటలో మొత్తం 22 స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ 19, బిజెపి ఒకటి, స్వతంత్ర అభ్యర్థి ఒకటి, బిఆర్ఎస్ రెండు స్థానాల్లో గెలుపొందాయి. సత్తుపల్లిలో బిఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చినప్పటికీ సత్తుపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత సాధించింది. ఇక్కడ 17 స్థానాల్లో కాంగ్రెస్ ఆరు స్థానాల్లో, బిఆర్ఎస్ విజయం సాధించాయి. ఇల్లందులో 24 వార్డులకు గాను కాంగ్రెస్ 19 స్థానాల్లో, బిఆర్ఎస్ మూడు, స్వతంత్ర అభ్యర్థి ఒక చోట విజయం సాధించారు.

## కొత్తగూడెం సిపిఐ విజేతలు వీరే..



## కొత్తగూడెంలో సిపిఐ విజయోత్సవ సంబరాలు





# నల్ల నేలన ఎర్రజెండా రెపరెపలు

**(మొదటిపేజీ తరువాయి)**

ఫలితం లేకపోయింది. గతంలో కొత్తగూడెం మున్సిపాలిటీని కైవసం చేసుకున్న బిఆర్ఎస్ ఈ దఫా మూడవ స్థానంతో సరిపెట్టుకుంది. ఎనిమిది వార్డుల్లో మాత్రమే విజయం సాధించింది. స్వతంత్ర అభ్యర్థులతో కలిపి 24 స్థానాల్లో విజయం సాధించిన సిపిఐ స్వల్ప తేడాతో మూడు డివిజన్లలో ఓటమి చెందింది. పొత్తుల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ సిపిఐకి సరైన స్థానాలు కేటాయించకపోవడంతో సిపిఐ ఒంటరిగా బరిలోకి దిగింది. ఒంటరి పోరులో ముందు వరుసలో నిలిచింది. రాష్ట్రంలో ప్రధాన పార్టీలు కార్పొరేషన్ ఎన్నికల్లో తమ ప్రభావం చూపగా కొత్తగూడెంలో మాత్రం నిరంతర ప్రజాపోరాట వారధి సిపిఐ విజయకేతనం ఎగురవేసింది. ఈ గెలుపు సిపిఐని తగ్గించాలనుకున్న పలువురికి ఇది గుణపాఠంగా భావించాల్సి ఉంటుంది.

# సైదుబాబును పరామర్శించిన మేయర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వి. వెంకటాయపాలెం సొసైటీ మాజీ ఛైర్మన్ రావూరి సైదుబాబును మేయర్ పునుకొల్లు నీరజ పరామర్శించారు. 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ భర్త అయిన రావూరి సైదుబాబు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని శుక్రవారం అల్లిపురంలోని వారి స్వగృహంలో రావూరి సైదుబాబును మేయర్ పునుకొల్లు నీరజ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాన్ని సాధించాలంటే ఏకాగ్రత అవసరం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యం ను చేరుకునేందుకు ఏకాగ్రత చాలా అవసరమని విద్యాశాఖ ఏయంవో ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పీఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యాశాఖ సహకారంతో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం మోటివేషన్ మరియు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ విద్యార్థుల కోసం పీఎంఆర్ ట్రస్టు చేస్తున్న విద్యా సేవా కార్యక్రమాలు అభినందనీయం అన్నారు. విద్యార్థులు వాటిని వినియోగించుకుని ఉన్నత స్థానాలు సాధించాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని అన్నారు. పోటీ ప్రపంచంలో ముందుంజ లో నిలిపేందుకు ప్రేరణాత్మక సందేశం అన్నారు. విద్యారంగం అభివృద్ధి కి ట్రస్టు చేపడుతున్న కార్యక్రమాలుఆదర్శప్రాయం అన్నారు. దాదాపు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులు ఉన్నత చదువులు కొనసాగించేందుకు ట్రస్టు పూర్తి స్థాయి లో సహకరిస్తుందని అధ్యక్షుడు రవి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు, ఉపాధ్యాయులు ఎన్.జయరాజ్, ఎస్.నాగర్జన్ ట్రస్టు నిర్వహాకులు ప్రగతి, ప్రసాద్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఖాతాదారులకు భద్రత పట్ల అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ నేతృత్వంలో, వినియోగదారులందరికీ తమ బ్యాంక్ ఖాతా భద్రత పట్ల అవగాహన కల్పించడం జరుగుతోంది. అర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సులో బాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్బీఐ నిబంధనల ప్రకారం, ప్రతి ఖాతాదారుడు తమ కేవైసీ కనౌయువర్ కస్టమర్ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరి. ఖాతా భద్రత: మీ ఖాతా లావాదేవీలు సురక్షితంగా ఉండటానికి మరియు మోసాలను అరికట్టడానికి ఇది సహాయపడుతుంది. అవాంతరాలు లేని సేవలు: మీ కేవైసీ అప్‌డేట్ లేకపోతే, భవిష్యత్తులో నగదు విత్ డ్రా లేదా ఇతర బ్యాంకింగ్ సేవలలో ఇబ్బందులు ఎదురుకావచ్చు బ్యాంకింగ్ సేవలను నిరంతరాయంగా పొందడానికి, ప్రతి వినియోగదారుడు తమ కెవైసిని నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ తెలియచేసారు. ఈ కార్యక్రమం లో బ్రాంచ్ మేనేజర్ కొప్పుల సౌజన్య, అసిస్టెంట్ మేనేజర్ శరత్ చంద్రిక ఫీల్డ్ ఆఫీసర్ కె.భరత్ మరియు శాఖ సిబ్బంధి పాల్గొన్నారు. ఏదైనా సహాయం కోసం నేరుగా బ్యాంకును లేదా మీ పరిధిలోని పిఏసిఎస్ సొసైటీ సీఈఓ లను సంప్రదించాలని బ్రాంచి మేనేజర్ కొప్పుల సౌజన్య తెలియజేశారు.

# ఉత్కంఠ పోరులో సిపిఐ అభ్యర్థి నల్లమోతు శైలజ విజయం

### విజయం అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ ఫలితం ఉత్కంఠభరితంగా సాగింది. సిపిఐ అభ్యర్థి నల్లమోతు శైలజ కాంగ్రెస్ అభ్యర్థి రాంపూడి రాజ్యలక్ష్మి పై తొలుత 13 ఓట్ల మెజాఇరటీతో గెలుపొందారు. తర్వాత ఓట్లలో వ్యత్యాసం ఉందని అనడంతో మరోసారి ఓట్ల బ్యాలెట్ బండిల్‌లను అధికారులు లెక్కించగా సిపిఐకి మరో రెండు ఓట్లు పెరిగాయి. దీంతో సిపిఐ 15 ఓట్లతో మెజారిటీ వచ్చింది. అయితే సిపిఐ అభ్యర్థి నల్లమోతు శైలజ గెలుపు ప్రకటించకుండా ఉత్కంఠతకు తెరలేపారు. మెజారిటీ ఉన్నా కూడా పలుసార్లు కౌటింగ్ మరల చేయాలని పట్టుబట్టడం లోపల జరిగిన పరిణామాలు ఒక్కసారిగా ఉత్కంఠకు తెర లేపింది. అధికార కాంగ్రెస్ ఫలితం ప్రకటించకుండా జాప్యం చేసిందని సిపిఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా నాయకులు గోవిందరావు, ఎర్ర బాబు, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, మాజీ శాసనసభ్యురాలు బానోతు చంద్రావతి, దొండపాటి రమేష్, యామాల గోపాలరావు, టిఆర్ఎస్ నాయకులు ఒక్కసారిగా పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. కౌంటింగ్ కేంద్రంలో జరుగుతున్న పరిణామాలను బాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర అధ్యక్షులు సాంబశివరావు దృష్టికి తీసుకుపోవడంతో పరిస్థితిని జిల్లా కలెక్టర్‌కు కూనంనేని సాంబశివరావు వివరించడం జరిగింది. అనంతరం కొద్దిసేపటికే అధికారులు ఉత్కంఠకు ముగింపు పలుకుతూ నల్లమోతు శైలజ 18 ఓట్ల మెజారిటీతో గెలిచిందని ప్రకటించారు. దీంతో సిపిఐ, సిఇపెం, బిఆర్ఎస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.

# మధిర మున్సిపాలిటీపై ఎగిరిన కాంగ్రెస్ జెండా

### - ఫలించిన డిప్యూటీ సిఎం భట్టి వ్యూహం
### - 21 వార్డుల్లో కాంగ్రెస్ కూటమి విజయం



**ప్రజాపక్షం/మధిర :** పట్టు వదలని విక్రమార్కుడు డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క అని మరోమారు రుజువైంది. మధిర మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనని పట్టుబట్టి ఒక వైపు పార్టీ శ్రేణులను కదలించారు. పోరాట స్ఫూర్తిని నింపారు. మరో వైపు రాబోయే 50 సంవత్సరాల సరిపడా మధిర అభివృద్ధికి చేస్తున్న కృషిని ఓటర్లకు తానే స్వయంగా వివరించి వారి మనస్సు గెలిచి ఘన విజయం సాధించారు. అన్ని తానై ముందుకు నడిచిన భట్టివిక్రమార్క తిరుగులేని ప్రజా నాయకుడని, తాను ఓ క్యాడర్ లీడర్ అని మరోమారి నిరూపించుకున్నారు. భట్టివిక్రమార్క ఏ పనిచేసినా పద్ధతి ప్రకారం చేసి ఫలితం సాధిస్తారని మరోసారి స్పష్టమైంది. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ సిఎంగా, ఆర్థిక, విద్యుత్, ప్రణాళికా శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు చేతికి వచ్చాయి. ఇదే అదునుగా తనను వరుసగా ఎమ్మెల్యేగా నాలుగుసార్లు గెలిపించిన మధిర ప్రజల రుణం తీర్చుకునే అవకాశం దక్కిందని భావించి డిప్యూటీ సిఎం తన ఏళ్ల నాటి కలలను సాకారం చేసేందుకు వ్యూహాత్మకంగా పావులు కదిపారు. రాజకీయ పొత్తులు, కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు, ఎన్నికల ప్రచారం, అభివృద్ధి ఎత్తుగడ, ప్రతి అంశంలో అనుకున్నట్టే ముందుకు వెళ్లి అద్భుత విజయాన్ని ప్రజానాయకుడు భట్టివిక్రమార్క అందిపుచ్చుకున్నారు. మధిర మున్సిపాలిటీలో ఏ పార్టీ బలం ఎంతో వాస్తవంగా అంచనా వేసి టిడిపితో కూటమిగా బరిలో దిగారు. 22 వార్డుల్లో టిడిపి బలపరిచిన స్వతంత్ర అభ్యర్థులు మూడు వార్డుల్లో పోటీలో నిలవగా, మిగిలిన 19 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీలో నిలబడ్డారు. తన గెలుపు కోసం పార్టీ నేతలు, కార్యకర్తలు ఎంతగా శ్రమిస్తారో, అంతకుమించి మున్సిపాలిటీలో కాంగ్రెస్ కూటమి అభ్యర్థుల గెలుపునకు డిప్యూటి సిఎం శ్రమించి గొప్ప స్ఫూర్తిని నింపారు. దీంతో తాను నిజమైన నాయకుడని మరోసారి నిరూపించుకున్నారు. తన బలం, బలహీనత కాంగ్రెస్ శ్రేణులేనని నమ్మి వారికి బాధ్యతలు అప్పగించి నిత్యం పర్యవేక్షించారు. వారు క్షేత్రస్థాయిలో చేయాల్సిన కార్యక్రమాలకు దిశానిర్ధేశం చేస్తూ ముందుకు నడిపించారు. పోటీచేసిన అభ్యర్థులను కంటికి పాపలా కాపాడుకున్నారు. మరోవైపు స్వయంగా తానే ప్రచారం రంగంలోకి దిగారు. ఎన్నికల ముందు నిర్వహించిన భారీ ర్యాలీతోనే మధిర మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని తేలింది. తాను డిప్యూటీ సిఎం అయినా చిన్నమున్సిపాలిటీలో ప్రచారం చేయడం అవసరమా అనే భావన లేకుండా వార్డుల వారీగా ప్రచారంలోకి దిగారు. రాబోయే 50 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా మధిర పట్టణాన్ని ఎలా అభివృద్ధి చేయబోతున్నారో కళ్లకు కట్టినట్లు వివరించి ఓటర్లను మెప్పించారు. విక్రమార్కుని వ్యూహం ఫలించింది. రికార్డులు తారుమారు అయ్యాయి. మధిర మున్సిపాలిటీని 22 స్థానాలకు గాను 21 వార్డుల్లో కాంగ్రెస్ కూటమి ఏకపక్షంగా గెలుచుకుని విజయ దుందుభి మోగించింది. కేవలం బిఆర్ఎస్, సిపిఎం,సిపిఐ కూటమికి ఒకే వార్డుకు పరిమితం కావడం భట్టి రాజకీయ చాణిక్యానికి అద్దం పట్టింది. మధిర మొత్తం జయహో భట్టివిక్రమార్క అంటూ నినదించింది.

# ప్రజలు భట్టివిక్రమార్క అభివృద్ధికి పట్టం కట్టారు..

### - మధిర పట్టణంలో భారీ విజయోత్సవ ర్యాలీ
### - రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల



**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** మధిర మున్సిపాలిటీ ఎన్నికల్లో మధిర మున్సిపాలిటీ ప్రజలు భట్టివిక్రమార్క అభివృద్ధికి పట్టం కట్టారని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు కొండబాల కోటేశ్వరరావు, టిడిపిరాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అన్నారు. శుక్రవారం మధిరలోని అమెరికా బిల్డింగ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మధిర ప్రజలు కాంగ్రెస్ పార్టీ భట్టివిక్రమార్క చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు తెలిపారని అన్నారు. డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గంలోని మధిర మున్సిపాలిటీలో సుమారు వెయ్యికోట్ల రూపాయలకుపైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ మధిర మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తయారు చేస్తున్నసందర్భంగా జరిగిన మధిర మున్సిపల్ ఎన్నికల్లో 22 వార్డుల్లో 21 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగరవేశారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం దగ్గర నుండి భట్టివిక్రమార్క వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ ప్రత్యర్థి పార్టీలకు అందనంతగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారని వారు తెలిపారు. భట్టి అంటేనే అభివృద్ధి అని, అభివృద్ధిని మధిర ప్రజలు కోరుకున్నారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకువారి విజయానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు డిప్యూటీ సిఎం భట్టి తరుపున వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు మిరియాల రమణ గుప్తా తదితరులు పాల్గొన్నారు. అనంతరం మధిర పట్టణంలో కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. పట్టణంలో ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించి రంగులు చల్లుకుంటూ డిజే సౌండ్ సిస్టంతో బాణసంచా కాల్చి విజయోత్స సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా పురపాలక ఎన్నికల కౌంటింగ్

### -కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రి య ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రియదర్శిని కళా శాలలో ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపల్ కౌంటింగ్ సెంటర్‌ను శుక్రవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించి కౌంటింగ్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనం తరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్, మానిటరింగ్ సెల్ నుండి అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి ఐదు మున్సిపాలిటీల కౌంటింగ్ ప్రక్రియను కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో మధిర, సత్తుపల్లి, ఏదులాపురం, వైరా, కల్లూరులో ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. గత మున్సిపాలిటీ పరిధిలో రెండు రౌండ్ల చొప్పున కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టి ఫలితాలు ప్రకటించామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మండల పరిధిలోని కోయచలక గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో గ్రామస్తులకు బ్యాంకింగ్ సేవలు, పథకాలకు సంబంధించి అవగాహన కల్పించారు. బ్యాంక్ కెవైసి, ఈకెవైసి, సికెవైసి లకు సంబంధించి, ఏపివై, పిఎంజేజేబివై, పిఎంఎస్‌బివై, ఎస్ఎస్‌వై, రూపే కార్డు వంటి పథకాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బలుసుపాటి శేషయ్య, ఉపసర్పంచ్ మాధంశెట్టి హన్మంతరావు, పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి, స్థానికులు చెరుకూరి పూర్ణచందర్‌రావు, చెరుకూరి సీతారాములు, కౌన్సిలర్స్ నాగేశ్వరరావు, లక్ష్మ య్య, కృష్ణవేణి పాల్గొన్నారు.

# ఆ సీనే రిపీట్..!

### - ముందే చెప్పిన ప్రజాపక్షం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల వేళ ఆ సీనే రిపీట్ అయ్యింది. నాడు ఏదులాపురం సొసైటీ ఎన్నికలలో మామిండ్ల నిరంజన్‌రెడ్డి వెంపటి రామకోటయ్య పోటి పడి నిరంజన్‌రెడ్డి గెలిచాడు. తాజాగా మున్సిపాలిటీగా ఆవిర్భవించిన అదే ప్రాంతం నుంచి 30వ డివిజన్‌లో నిరంజన్‌రెడ్డి కుమారుడు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి సిపిఐ నుంచి, రాంకోటయ్య కుమారుడు వెంపటి సురేష్ కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. అయితే ఈ పోటీ సమయంలో ప్రజాపక్షం దినపత్రిక ఆ సీనే రిపీట్ కానుందని, కథనాన్ని ప్రచురించింది. ఇది అక్షరసత్యం అయ్యి శ్రీనాథ్‌రెడ్డి గెలుపొందగా...సురేష్ ఓటమి పాలయ్యాడు.

# ఆర్థిక డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** మధిర మండలం మడుపల్లి గ్రామంలో శుక్రవారం ప్రభుత్వం రంగ సంస్థ మడుపల్లి శాఖ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రవేశపెట్టే పథకాలపై గ్రామ ప్రజలకు నాబార్డ్ వారి ఆర్థిక అక్షరాస్యత నిధులు సహకారంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా కళాజాత బృందం వారు బ్యాంకు ద్వారా అందించే పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కె.నాగలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రతిఒక్కరూ సురక్ష బీమా యోజన పథకం కింద ఏడాదికి రూ.20 చెల్లిస్తే రూ.2లక్షల వకు ప్రమాద బీమా వర్తిస్తుందని అన్నారు. జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద ఏడాదికి రూ.436 చెల్లిస్తే జీవిత బీమా ర.2లక్షలు వరకు వరిస్తుందని అన్నారు. జన్‌ధన్ ఖాతా ద్వారా జీరో అకౌంట్ ఉచితంగా తెరుస్తామని బ్రాంచ్ మేనేజర్ నాగలక్ష్మి తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్‌సిబ్బంది, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

# శిరీష గెలుపు.. 1వ వార్డు ప్రజల గెలుపు



**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** దోర్నాల శిరీష గెలుపు 1వ వార్డు ప్రజల గెలుపు అని దోర్నాల రవి పేర్కొన్నారు. ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ హవా అని, ఎవరు ఎన్ని జిమ్ముక్కులు చేసినా, ఎత్తుగడలు వేసినా కాంగ్రెస్ గెలుపును నిలువరించడం ఎవరి తరం కాదన్నారు. డిప్యూటీసిఎం మల్లు భట్టివిక్రమార్క చేస్తున్న అభివృద్ధికే ప్రజలు కట్టారని అన్నారు. శుక్రవారం మధిర మున్సిపాలిటీకి వెలువడిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు 21 స్థానాల్లో విజయం సాధిచారని తెలిపారు. 1వ వార్డులో దోర్నాల శిరీష గెలుపుకు సహకరించిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మన పాఠశాల..మన బాధ్యత

**-సర్పంచ్ మండ్రు రామకృష్ణ ఆలోచనకు నాంది**
**-ఆటో కొనుగోలుకు పూర్వ విద్యార్థుల ఉదార సహాయం**



**ప్రజాపక్షం/అశ్వాపురం :** అశ్వాపురం మండలంలోని నెల్లిపాక గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల రవాణా సౌకర్యం కోసం గ్రామంలో స్ఫూర్తిదాయక కార్యక్రమం ఆరంభమైంది. విద్యార్థులు రాకపోకల ఇబ్బందులు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో గ్రామ సర్పంచ్ మండ్రు రామకృష్ణ పాఠశాలకు ప్రత్యేకంగా ఆటో కొనుగోలు చేయాలని నిర్ణయించుకుని గ్రామ పెద్దలను విద్యార్థులను ఉపాధ్యాయులను అడిగి ఆలోచనకు నాంది పలికారు. ఈ ఆలోచనకు గ్రామ పూర్వ విద్యార్థుల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా 198384 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి పద్మ రూ 50వేలు ఆర్థిక సహాయం అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. అలాగే గుంటుపల్లి జ్యోతి రూ 15వేలు, మాదినీడి రాంబాబు రూ 25వేలు విరాళంగా అందించి పాఠశాలపై తమ మమకారాన్ని చూపించారు. మనకు చదువు నేర్పి, మంచి స్థాయికి చేర్చిన పాఠశాలకు తిరిగి ఇవ్వడం మన బాధ్యత అనే భావనతో వారు ముందుకు రావడం గ్రామంలో ప్రశంసలు అందుకుంటోంది. గ్రామంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఈ ఆటో ఎంతో ఉపయుక్తంగా ఉండనుంది. రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు, విద్యార్థుల హాజరు శాతం పెరిగే అవకాశముంది. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు బలోపేతం కోసం పూర్వ విద్యార్థులు ఒక్కొక్కరిగా ముందుకు వస్తుండటం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోంది. నెల్లిపాకలో మొదలైన ఈ చైతన్యం, "మన పాఠశాల మన బాధ్యత" అనే సందేశాన్ని గ్రామమంతటా వ్యాప్తి చేస్తోంది. పాఠశాల అభివృద్ధి కోసం గ్రామ సమాజం ఒకటిగా నిలవడం విద్యకు కొత్త దిశనను చూపుతోంది.

## తనుకుల శ్రీనివాస్‌కు సన్మానం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన తనుకుల శ్రీనివాస్‌ను సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నే రవి ఘనంగా సన్మానించారు. మణుగూరు భావన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం లో గురువారం జరిగిన సంఘ ఎన్నికల్లో విజయం సాధించిన తనుగకుల శ్రీనివాస్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంకి వెళ్ళి పూలమాలలు, శాలువా వేసి, స్వీట్ తినిపించి అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది గొడుగునూరు నాగార్జున రెడ్డి, సామాజిక సేవకులు కర్నే బాబురావు, వేములూరి లక్ష్మయ్య, గణేష్ ,పోనం.రాము.కమటం పోల్ రెడ్డి ,కటకురీ ,తిరుపతి, కర్ణాటక. మారేష్ ,తమ్మిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమికి ఓటు వేసిన వారికి ధన్యవాదాలు



**ప్రజాపక్ష/వైరా:** వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ కూటమికి ఓటు వేసి అండగా నిలిచిన ప్రతిఒక్క ఓటర్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని కూటమి నాయకులు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం శుక్రవారం వైరాలో కట్టా నాగేశ్వరరావు స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శిభూక్యా వీరభద్రం, సిపిఐ వైరా డివిజన్ కార్యదర్శి ఎర్ర బాబు, వైరా మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జున్‌రావు, వైరా మాజీ శాసనసభ్యురాలు డాక్టర్ బానోత్ చంద్రావతి మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అధికార దాహంతో అనైతిక పద్ధతులను అనుసరించడం వల్లే కొన్ని స్థానాల్లో విజయం సాధించిందని ఆరోపించారు. కేవలం స్వల్ప ఓటింగ్ తేడాతో పలు స్థానాల్లో కూటమి ఓటమి పాలైనప్పటికి ప్రజల మద్దతు పరంగా నైతిక విజయం పూర్తిగా బిఆర్ఎస్ వామపక్ష కూటమిదేనని స్పష్టం చేశారు. మొత్తం 20 స్థానాలున్న వైరా మున్సిపాలిటీలో బిఆర్ఎస్ వామపక్ష కూటమి 7 స్థానాలు గెలవడం హర్షణీయమని తెలిపారు. వైరా మున్సిపాలిటీ పరిధిలో కూటమికి ఓటు వేసిన ప్రతిఒక్క ఓటర్‌కు ప్రత్యేక కృతజ్ఞలు తెలిపారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ పార్టీలు కలిసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింత బలంగా పోరాడతాయని, ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామని తెలిపారు. ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో 8వ వార్డు కౌన్సిలర్ చిలకా చిన్న కోటయ్య, కామినేని శ్రీనివాసరావు, లాల్‌మహ్మద్, ఏలూరు శ్రీను, అమరనేని కృష్ణ, వజినేపల్లి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఏదులాపురాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్

**- ఒంటరి పోరులో సత్తా చాటిన సిపిఐ**
**- మూడవస్థానానికి పరిమితమైన బిఆర్ఎస్**
**- సిపిఐ మద్దతుతో గెలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థి**













**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగరవేసింది. 25వార్డులను సాధించి ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా సింగిల్‌లార్జెస్ట్ పార్టీగా అవతరించి చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఒంటిరిగా బరిలోకి దిగిన సిపిఐ 28,30,32 వార్డులను గెలుచుకొని, సత్తా చాటింది. ఇందులోను మూడవవార్డులో సిపిఐ మద్దతుతో ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందాడు. బిఆర్ఎస్ రెండు స్థానాలలో గెలిచి మూడవ స్థానానికి పరిమితమైంది. అలాగే సిపిఎం రెండు స్థానాలను గెలుచుకుంది.

### ఒంటరిపోరులో సత్తా చాటిన సిపిఐ...

ఎటువంటి పొత్తు లేకుండా ఒంటరిగా బరిలోకి దిగిన సిపిఐ తన సత్తాను చాటుకుంది. అధికారం, డబ్బును వెదజల్లినప్పటికీ ఇక్కడి ప్రజలు సిపిఐకే జైకొట్టారు. సిపిఐని దెబ్బకొట్టేందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఎం పార్టీలు ఒక్కటై పని చేశాయి. ఇలా సిపిఎం గెలిచిన 21,22వార్డులలో కాంగ్రెస్ పోటీనే చెయ్యలేదు. అలా మూడు పార్టీలు ఏకమై సిపిఐని కనుమరగు చేసేందుకు పన్నిన కుట్రలకు కామ్రేడ్స్ ఎదురొడ్డి నిలిచారు. అలాగే 3వ వార్డులో సిపిఐ మద్దతుతో ఇండిపెండెంట్ అభ్యర్థి గెలిచారు.

### మూడవ స్థానానికి పరిమితమైన బిఆర్ఎస్...

అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీ ఇస్తుందనుకున్న బిఆర్ఎస్ చతికిలపడి మూడవస్థానానికే పరిమితమైంది. ఒక్క సీటులో మినహాయిస్తే పోటీ చేసిన అన్ని వార్డులలో సిపిఐ రెండవ స్థానాన్ని కైవసం చేసుకొని, గౌరవప్రదంగా నిలబడింది. కానీ బిఆర్ఎస్ పార్టీ అధికార కాంగ్రెస్‌కు ఎక్కడ కూడా పోటీని ఇవ్వలేకపోవడం గమనర్హం. అంతేకాకుండా సిపిఐ పార్టీ ఓటమికి కృషి చేసి తన నాలుకను తానే కరుచుకుంది.

### సిపిఐ భారీ ర్యాలీ...

సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో కౌంటింగ్ కేంద్రం నుంచి టపాసుల మోతల నడుమ ద్విచక్రవాహనాలు, ఎర్రజెండాల రెపరెపలు, డిజె పాటలతో భారీ ర్యాలీని నిర్వహించారు. ఇది వరంగల్‌క్రాస్‌రోడ్‌లోని 28, 30, ఏదులాపురంలోని 32వ డివిజన్‌లో కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ర్యాలీకి ముందు నడుస్తూ ప్రతి ఒక్కరిని కలిసి ధన్యవాదాలు తెలుపుకుంటూ ముందుకు సాగారు.

# మధిరలో కాంగ్రెస్ జైత్రయాత్ర

**- 19వార్డుల్లో హస్తం విజయం**
**- 3వార్డుల్లో కాంగ్రెస్ టిడిపి కూటమి కైవసం**
**- ఒకే ఒక్క వార్డుకు పరిమితమైన బిఆర్ఎస్**



**ప్రజాపక్షం/మధిర:** మధిర మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 22వార్డులున్న ఈ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ 19, కాంగ్రెస్ టిడిపి కూటమి 3 స్థానాలు గెలిచి క్లీన్ స్వీప్ దిశగా దూసుకెళ్లింది. ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ, సిపిఎం, సిపిఐ కూటమి కేవలం ఒకే ఒక్క స్థానానికి పరిమితమైంది. శుక్రవారం మధిరలోని పాలిటెక్నికల్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో జరిగిన కౌంటింగ్‌లో అధికారులు అభ్యర్థుల గెలుపొందిన వివరాలను వెల్లడించారు. 1వ వార్డు దోర్నాల శిరీష( కాంగ్రెస్), 2వ వార్డు బాణావత్ వెంకటరమణ( కాంగ్రెస్), 3వ వార్డు బెజ్జం రాజు(కాంగ్రెస్), 4వ వార్డు సామినేని సుజాత(కాంగ్రెస్), 5వ వార్డు పిల్లి సునీత(కాంగ్రెస్), 6వ వార్డు వేమిరెడ్డి లక్ష్మీ తులసి(కాంగ్రెస్) , 7వ వార్డు శీలం నర్సిరెడ్డి,(కాంగ్రెస్) 8వ వార్డు యన్నం కోటేశ్వరరావు(కాంగ్రెస్) , 9వ వార్డు ఎర్రందాసు చారులత(కాంగ్రెస్), 10 వార్డు బోడేపూడి రేవతి(టిడిపి), 11వ వార్డు గద్దల మాధురి(కాంగ్రెస్), 12వ వార్డు మోదుగు నాగలక్ష్మి (కాంగ్రెస్), 13వ వార్డు షేక్.రసీద్దీన్(కాంగ్రెస్), 14వ వార్డు శ్రీపాలశెట్టి వెంకట్రావు(కాంగ్రెస్), 15వ వార్డు నకిరికంటి రాజేశ్వరి(కాంగ్రెస్), 16వ వార్డు వంకాయలపాటి నాగేశ్వరరావు(టిడిపి), 17వ వార్డు ములకలపల్లి వినయ్‌కుమార్(టిడిపి), 18వ వార్డు కోన ధనికుమార్(కాంగ్రెస్), 19వ వార్డు యన్నంశెట్టి అప్పారావు(బిఆర్ఎస్), 20వ వార్డు బొల్లెద్దు విజయకుమారి(కాంగ్రెస్), 21వ వార్డు రంగా రూప (కాంగ్రెస్), 22వ వార్డు దారా నాగరాజు(కాంగ్రెస్) కౌన్సిలర్లుగా గెలుపొందారు. ఇదిలా ఉంటే మధిర మున్సిపాలిటీ చైర్‌పర్సన్ జనరల్ మహిళకు రిజర్వ్ కావటంతో రేసులో వేమిరెడ్డి లక్ష్మీ తులసి( రెడ్డి), సామినేని సుజాత(కమ్మ), రంగా రూప(ఆర్యవైశ్య) సామాజిక వర్గాలకు చెందిన వారు ఉండగా చైర్‌పర్సన్ పదవి ఎవరికి వరిస్తుందో వేచిచూడాల్సిందే.

## వైరా మున్సిపాలిటీలో విజయం సాధించిన కాంగ్రెస్ కౌన్సిలర్లు వీరే..





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో శుక్రవారం జరిగిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి 12 కౌన్సిలర్లు కాంగ్రెస్ ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. గెలుపొందిన అభ్యర్థులు వీరే...1వ వార్డు మోరు శ్రీకాత్(కాంగ్రెస్) 121 ఓట్ల మెజారిటీతో విజయం, 3వ వార్డు బొర్రా ఉమాదేవి(కాంగ్రెస్) 154 ఓట్ల మెజారిటీతో విజయం, 4వ వార్డు నిమ్మతోట శ్రావణి(కాంగ్రెస్) 223 ఓట్ల మెజారిటీతో విజయం, 6వ వార్డు కాపా చంద్రకళ(కాంగ్రెస్) 286 ఓట్ల మెజారిటీతో విజయం, 7వ వార్డు ఫనితి సైదులు(కాంగ్రెస్) 176 ఓట్ల మెజారిటీతో విజయం, 9వ వార్డు కట్ల సంతోష్(కాంగ్రెస్) 185 ఓట్ల మెజారిటీతో విజయం, 13వ వార్డు ముళ్ళపాటి విజయలక్ష్మి(కాంగ్రెస్) 230 ఓట్ల మెజారిటీతో విజయం, 14వ వార్డు ధీరావత్ వెంకటేశ్వర్లు(కాంగ్రెస్) 430 ఓట్ల మెజారిటీతో విజయం, 16వ వార్డు రాచబండి బలరామయ్య (కాంగ్రెస్) 86 ఓట్లు మెజారిటీతో విజయం, 17వ వార్డు బత్తుల సుమతి(కాంగ్రెస్) 241 మెజారిటీతో విజయం, 18వ వార్డు గోరంట్ల శ్రీదేవి(కాంగ్రెస్) 279 మెజారిటీతో విజయం, 19వ వార్డు చింతనిప్పు సులోచన(ఇండిపెండెంట్) 124 ఓట్ల మెజారిటీతో విజయం, 20వ వార్డు వుండ్రు వరలక్ష్మి (కాంగ్రెస్) 428 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

# మంచి ఆరోగ్యం కోసం సమతుల్య ఆహారం తీసుకోవాలి

**-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మంచి ఆరోగ్యం కోసం సమతుల్య ఆహారం తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ గ్రామంలో గల జెడ్‌పిహెచ్‌ఎస్‌లో ఐటిసి సారపాక ఆధ్వర్యంలో రక్తహీనత(అనీమియా)అవగాహన కార్యక్రమం నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా విద్యార్థులు, గర్భిణీ స్త్రీలకు అనీమియా స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనీమియా లక్షణాలు, కారణాలు, నివారణ చర్యల గురించి వివరించారు. రోగ నిరోధక శక్తి పెంపు, ఆకుకూరలు, తాజా కూరగాయాలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్ వినియోగం అవసరమని తెలిపారు. నూలి పురుగుల నివారణ మాత్రల వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రత, సరైన విధానంలో చేతులు కడుక్కోవడం, మంచి అలవాట్లు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. అదే విధంగా స్పర్శ కుష్ఠ వ్యాధి అవగాహన కార్యక్రమం ముగింపు వేడుకను కూడా నిర్వహించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో పిహెచ్‌సి ఎంవో డాక్టర్ సాహితి, డీపీఎంఓ మోహన్, ఎంపి హెచ్‌ఈవో రవి, ఐటిసి సిఎస్‌ఆర్ సభ్యులు గీతా పల్లవి, రాజేష్ కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్గత రోడ్లు వేయాలని మహిళల నిరసన



**ప్రజాపక్షం/చంద్రుగొండ :** మండల పరిధిలోని తిప్పనపల్లి గ్రామ పంచాయితీలోని ఎస్సీకాలనీ వాసులు అంతర్గత రోడ్లను బాగు చేయాలని, నూతనంగా సీసీ రోడ్లు వేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎస్సీ కాలనీవాసులు, గ్రామస్తులు నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు(ఎస్సీ కాలనీ వాసులు)మాట్లాడుతూ ఎస్సీ కాలనీ, చౌకలిబజార్ వీధులు నడవటానికి వీలులేకుండా ఉన్నాయని, ఎన్నికల సమయంలో అధికార పార్టీ నాయకులు సీసీ రోడ్లు వేస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారు. ఇప్పుడు ముఖం చాటేశారని విమర్శించారు. ఎన్నికలప్పుడు రావడం ఓట్లు వేయించుకోవడం, ఇప్పుడు మా కాలనీ వైపుకు అసలు రాకుండా నాయకులు తప్పించుకు తిరుగుతున్నారని ఆరోపించారు. అధికారులు సైతం ఎస్సీ కాలనీ వైపు ఎందుకు రావడం లేదో అర్థం కావడం లేదన్నారు. మా వీధులకు రోడ్లు వద్దా, మేం మనుషులం కాదా...అంటూ అధికారుల తీరును వారు ప్రశ్నిస్తున్నారు. మా వీధులకు అంతర్గత రోడ్లను బాగు చేయకపోతే త్వరలో గ్రామ పంచాయితీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో ఎస్సీ కాలనీ వాసులు, చౌకలి బజార్ వాసులు చెంగళి కొండలు, వాణి, నాగమణి, నాగేంద్ర, స్వరూప, సునీత, జ్యోతి, వెంకటక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కూసుమంచిలో అన్నదాతలకు చేదు అనుభవం

**-గుళికలు కొంటేనే యూరియా ఇస్తాం**
**-యాప్ రిజిస్ట్రేషన్‌తో సంబంధం లేదంటూ ముఖం చాటేస్తున్న వైనం**

**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండల కేంద్రంలో అన్నదాతలకు చేదు అనుభవం ఎదురవుతుంది. డీలర్ల వద్దకు(కొందరు డీలర్లు మాత్రమే)యూరియా కోసం వెళ్ళిన రైతులతో డీలర్లు మా వద్ద నుండి గుళికలు ఇంకాపై మందులు తీసుకుంటేనే యూరియా కట్టలు ఇస్తాము లేకుంటే మీ ఇష్టం అంటూ ముఖం చాటేస్తున్నారని, ఇంకా మీరు యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న మాకు అవసరం కాదు అంటున్నారని మండల కేంద్రంలో పలువురు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే యాప్‌లో యూరియా కట్టలు మెరుపులా మాయమవుతున్న పరిస్థితుల్లో కొందరు డీలర్లకు ఈ ఇబ్బందికర పరిస్థితిలో ఇదే అవకాశంగా ఇదే అదునుగా భావించిన మందులు కొంటేనే యూరియా కట్టలు ఇస్తామని కొండి పెట్టడంతో రైతులు చేసేది ఏమీ లేక నిరాశతో వెను తిరిగిపోతున్నారు. ఇటీవల కొంత మంది రైతులు యూరియా కట్టలు తీసుకోకుండానే వెనుదిరిగి నిరాశతో చేసేది ఏమీ లేక డీలర్లను ఏమీ నిలదీయలేక అడగలేక పోతున్నామంటూ తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి రైతులకు డీలర్ల నుండి ఎటువంటి ఇబ్బందులు రాకుండా మందులతో లింకు పెట్టకుండా నేరుగా యూరియా కట్టలు ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## విద్యార్థులకు పోషకాహారం అందించాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని బూర్గంపాడు గ్రామ పంచాయితీ సర్పంచ్, ఉపసర్పంచ్ మందా నాగరాజు, గుండె వెంకన్నలు అన్నారు. శుక్రవారం పంచాయితీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, తరగతి గదులను, పరిశుభ్రత వంటి అంశాలను వారు సమగ్రంగా పరిశీలించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భోజనం నాణ్యతపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పిల్లలకు సమయానికి భోజనం వడ్డించాలని ఉపాధ్యాయులకు, వంట సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. అనంతరం ఉప సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, విద్య రెండూ సమానంగా ముఖ్యమైనవని, పాఠశాలలో భోజనం నాణ్యతపై ఎటువంటి రాజీ పడకూడదని అన్నారు. అవసరమైతే మెనే అమలుపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జి శేషగిరి, గ్రామ పంచాయితీ సిబ్బంది అనిల్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## పశుసంతతిని కాపాడితేనే రైతులకు మేలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** రోజు రోజుకు అంతరించిపోతున్న పశు సంపదను కాపాడాల్సిన బాధ్యత రైతులపై ఉందని అలాగే ఉన్న పశువులకు రోగాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విశ్వనాథపల్లి సర్పంచ్ ఇస్లావత్ రాజు, మండల పశువైద్యాధికారి ఇందిర అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలో పశు వైద్యశిబిరాన్ని మండల పశు వైద్యాధికారి ఇందిర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ రాజుతో కలిసి ఆమె మాట్లాడుతూ నానాటికి అంతరించిపోతున్న పశుసంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పశువులకు సీజనల్‌గా ఎలాంటి రోగాలు రాకుండా ముందస్తు టీకాలు వేయించుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స నిర్వహించారు. అలాగే సూడి పరీక్షలు నిర్వహించి, నట్టల మందులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్వైజర్ వెంకటేష్, గోపాలమిత్రలు రేగళ్ల యంగయ్య, సురభి శ్రీకాంత్, ఈ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



**ప్రజాపక్షం/పినపాక:** తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా(టిఈఎల్ఎస్ఏ)వారి ఆర్థిక సహకారంతో జెడ్‌పిహెచ్‌ఎస్ పినపాక పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు క్రీడా దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేయూతనందించే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా సభ్యులైన మల్లికార్జున కేశవరాజు ప్రోత్సాహంతో తన బాల్య మిత్రులు అయినటువంటి కెవి రమణ మూర్తి ద్వారా క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని అన్నారు. దాతలు అందించిన ఈ సహకారాన్ని స్వీకరించి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కొమరం నాగయ్య, పినపాక సర్పంచ్ అలివేలు, ఏఐపిసి ఛైర్ పర్సన్ కౌసల్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తప్పని గర్వ భంగం



**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ ఎన్నికలలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని గెలవాలని చూసిన కాంగ్రెస్ పార్టీకి గర్వ భంగం తప్పలేదు. ప్రభుత్వం మాదంటూ పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేది నేనంటూ, ఏది చేయాలన్నా, మరేదైనా ఇవ్వాలన్నా నేనేనంటూ, సంక్షేమ పథకాలు కావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని చేసిన ప్రసంగంలో పరోక్షంగా బెదిరింపులకు దిగిన ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలకు బదులుగా పాల్వంచ ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. అధిక సీట్లను గెలుచుకొని మేయర్ స్థానాన్ని దక్కించుకోవాలని చేసిన ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టారు. నిత్యం ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేసిన పార్టీనే ప్రజలు ఆదరించారు.కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా సిపిఐ గుర్తించారు. కాంగ్రెస్ పార్టీతో సమానంగా గెలిపించారు. మొదటగా ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ కన్నా అధిక స్థానాలలో మెజారిటీ దిశగా దూసుకుపోయిన సిపిఐ సొంతంగా మేయర్ స్థానాన్ని దక్కించుకొనే రీతిలో విజయం సాధిస్తుందనుకొన్నారు. చివరి వరకు ఫలితాలు దోబూచులాడాయి. సిపిఐ మొత్తం 22 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయటంలో ఘోరంగా విఫలం చెందినదంటూ ప్రజల ముందుకు బిఆర్ఎస్ తెచ్చిన కాంగ్రెస్ బాకీ కార్డులు ప్రజలను ఆలోచింపజేశాయి. ఆపార్టీని 6 స్థానాలలో గెలిపించారు. దీనితో మంత్రికి చెరపకురా చెడేవు అన్న సామెత సరిగ్గా సరిపోయిందని ప్రజలు అంటున్నారు. ఓ పోలీసు అధికారి సైతం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఓ ఇండిపెండెంట్ అభ్యర్థిని పోటీ నుండి తప్పుకోవాలని సూచించినట్లు పట్టణ వ్యాప్తంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# ఒంటరి పోరులో సత్తా చాటిన సిపిఐ



-సిపిఐని ఓడించేందుకు అపవిత్ర కలయికలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఒంటరి పోరుతో సిపిఐ సత్తా చాటింది. ఆది నుంచి సిపిఐకి బలమైన పునాది కలిగిన ఈ ప్రాంతంలో సిపిఐని ఓడించేందుకు ప్రయత్నించారు. గతంలో ఏదులాపురం గ్రామ పంచాయతీగా ఉండేది. స్వాతంత్ర్య ఏర్పడిన నాటి నుంచి ఈ గ్రామ పంచాయతీ సిపిఐకి పెట్టని కోటగా ఉంది. పలుమార్లు సిపిఐని ఓడించేందుకు ప్రయత్నించిన ప్రత్యర్థులు గెలుపొందలేకపోయారు. ఏదులాపురం పంచాయతీతో పాటు సిపిఎం నేత తమ్మినేని వీరభద్రం స్వగ్రామం తెల్దారుపల్లి, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా స్వగ్రామం ముత్తగూడెంతో పాటు పలు గ్రామాలను కలిపి మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. ఏదులాపురం పాత పంచాయతీ పరిధిలోని ఐదు స్థానాల్లో సిపిఐ పోటీ చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. కాంగ్రెస్ పార్టీతో జరిపిన చర్చల్లో పాత పంచాయతీ పరిధిలోని స్థానాల్లో సిపిఐకు అవకాశం కల్పించాలని కోరింది. కాంగ్రెస్ సుముఖత వ్యక్తం చేసినట్లే చేసి ఒంటరిని చేసి సిపిఐని దెబ్బతీయాలని ప్రయత్నించింది. సిపిఐ ఒంటరిగా బరిలోకి దిగి ఐదింటిలో మూడు స్థానాల్లో విజయం సాధించింది. సిపిఐకి చెందిన దండి రంగారావు, మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి, దండి శ్రీజ లు విజయం సాధించగా మరికొన్నింటిలో పోరాడి ఓటమి చెందింది. మూడు మినహా మిగిలిన స్థానాల్లో సిపిఐ ఓటమికి అపవిత్ర పొత్తులే కారణమయ్యాయి. ముత్తగూడెం పరిధిలోని 20, 21 వార్డుల్లో సిపిఎం, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసి పోటీ చేసి సిపిఐ అభ్యర్థులను ఓడించాయి. సిపిఎం బిఆర్ఎస్‌తో పొత్తులో ఉన్నప్పటికీ తెల్దారుపల్లిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతునిచ్చి ఒక వార్డును ఏకగ్రీవం చేసింది. ముత్తగూడెంలో బహిరంగంగానే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. ఇక్కడ బిఆర్ఎస్ మిగిలిన చోట్ల కాంగ్రెస్‌తో పోటీపడిన సిపిఐ పోటీచేసిన మాత్రం ప్రత్యక్షంగానో పరోక్షంగానో కాంగ్రెస్ పార్టీకి సహకరించింది. ఒంటరిగా బరిలోకి దిగిన సిపిఐ మూడు పార్టీలను ఢీకొని సత్తాను చాటింది. ఏదులాపురంలో సిపిఐ విజయంపై చర్చోప చర్చలు సాగుతున్నాయి.

## సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీ ప్రజలకు ధన్యవాదాలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణాల ప్రగతి కోసం మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేసిన ప్రతి ఒక్కరికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయిదయానంద్ దంపతులు. అదేవిధంగా విజయం సాధించిన 17 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లను ప్రత్యేకంగా అభినందించారు. గత పది రోజులుగా కాంగ్రెస్, మిత్ర పక్షాల పార్టీల అభ్యర్థులు విజయం కోసం అహర్నిశలు కష్టపడిన ప్రతి కార్యకర్త, నాయకులు, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా నిర్వహించిన ఎన్నికల అధికారులు, పోలీసులు, సంబంధిత సిబ్బందిని అభినందించారు.

## కోఆర్డినేటర్ చల్లగుళ్ళకు నేతల అభినందనలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. మొత్తం 17 వార్డుల్లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడేలా చేయడంలో మున్సిపల్ ఎన్నికల కోఆర్డినేటర్ చల్లగుళ్ళ నర్సింహరావు కీలక పాత్ర పోషించారు. ఎన్నికల ప్రచారం ప్రారంభమైనప్పటి నుంచి ఇంటింటి ప్రచారం, యువతతో సమావేశాలు, మహిళా సంఘాలతో చర్చలు వంటి కార్యక్రమాలతో నరసింహారావు అహర్నిశలు కృషి చేశారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ ప్రతి వార్డులో బలమైన కమిటీలు ఏర్పాటు చేసి, ప్రజల సమస్యలను నేరుగా విని ప్రచారంలో ప్రతిబింబింపజేయడం విజయంలో ప్రధాన కారణంగా నిలిచింది. ఈ సందర్భంగా చల్లగుళ్ళకు సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఫలితాలు సత్తుపల్లిలో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాభిమానాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

## వైరా మున్సిపాలిటీలో బిఆర్ఎస్ కూటమి అభ్యర్థులు వీరే..









**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల్లో శుక్రవారం వెలువడిన ఫలితాల్లో బిఆర్ఎస్ కూటమి 7 స్థానాలు గెలుచుకుంది. గెలిచిన కౌన్సిలర్ అభ్యర్థులు వీరే...2వ వార్డు తిరుపతి శివకుమారి(బిఆర్ఎస్) 402 మెజారిటీతో విజయం, 5వ వార్డు కట్టా స్వరూపరాణి(బిఆర్ఎస్) 178 మెజారిటీతో విజయం, 8వ వార్డు చిలకా చిన్న కోటయ్య(బిఆర్ఎస్) 294 మెజారిటీతో 10వ వార్డు కిన్నెర కృష్ణ(సిపిఎం) 292 మెజారిటీతో విజయం, 11వ వార్డు దొంతబోయిన వెంకటేశ్వర్లు(బిఆర్ఎస్) 329 మెజారిటీతో విజయం, 12వ వార్డు మాదినేని సునీత(బిఆర్ఎస్) 30 ఓట్ల మెజారిటీతో విజయం, 15వ వార్డుల నల్లమోతు శైలజ(సిపిఐ) 18 ఓట్లతో విజయం సాధించారు.

## కల్లూరు మున్సిపాలిటీ పీఠం కాంగ్రెస్‌దే..



**ప్రజాపక్షం/కల్లూరు:** మున్సిపాలిటీ ఎన్నికల్లో కల్లూరు మున్సిపాలిటీ ఫలితాలలో పీఠం కాంగ్రెస్ కాంగ్రెస్ దేనని ఓటర్లు రుజువు చేశారు. శుక్రవారం వెలువడిన ఫలితాలలో మొత్తం వార్డులు 20 కాగా కాంగ్రెస్ 12 , రెబల్ కాంగ్రెస్ ఒకటి, బి ఆర్ ఎస్ ఏడు వార్డులను, ఇరు పార్టీలు గెలుచుకున్నాయి. గెలుపొందిన అభ్యర్థులు ఒకటవ వార్డు జిల్లెల్ల స్వాతి కాంగ్రెస్ 92 ఓట్లు మెజార్టీ ,రెండవ వార్డు బీరెల్లి మాధవరావు కాంగ్రెస్ 137 ఓట్లు మెజార్టీ, మూడో వార్డు దాసరి సుధారాణి కాంగ్రెస్ 7 ఓట్లు మెజార్టీ, నాలుగో వార్డ్ భూక్యారాంబాయి కాంగ్రెస్ 115 ఓట్లు, ఐదవ వార్డు శీలం కోటేశ్వరి కాంగ్రెస్ 232 ఓట్లు మెజార్టీ, ఆరవ వార్డు భానోత్ మారోని కాంగ్రెస్ 246 ఓట్లు మెజార్టీ, ఏడవ వార్డు ధరావత్ మోహన్ నాయక్ నాలుగోట్ల మెజార్టీ కాంగ్రెస్ పార్టీ ,8వ వార్డు లక్కినేని రఘు టిఆర్ఎస్ పార్టీ 96 కోట్ల మెజార్టీ, 9వ వార్డు కళ్యాణపు నవ్య టిఆర్ఎస్ 41 ఓట్లు మెజార్టీ, 10వ వార్డు పెద్దపైన పెద్ద బోయిన లక్ష్మీ నరసింహారావు కాంగ్రెస్ 42 ఓట్లు మెజార్టీ, 11వ వార్డు కృష్ణం శెట్టి లక్ష్మి 51 ఓట్లు మెజార్టీ కాంగ్రెస్ పార్టీ, 12వ వార్డు మహమ్మద్ ఇస్మాయిల్ టిఆర్ఎస్ అభ్యర్థి 99 ఓట్లు మెజార్టీ ,13వ వార్డు దారాల చిన్న లక్ష్మి టిఆర్ఎస్ అభ్యర్థి 52 ఓట్ల మెజార్టీ, 14వ వార్డు సయ్యద్ రేష్మ టిఆర్ఎస్ 141 ఓట్లు మెజార్టీ ,15వ వార్డు యాసా నాగమణి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 76 ఓట్ల మెజార్టీ, 16వ వార్డు ఉబ్బన రాంబాబు రెబల్ కాంగ్రెస్ అభ్యర్థి 66 ఓట్లు మెజార్టీ, 17 వ వార్డు కనపర్తి శ్యామల టిఆర్ఎస్ అభ్యర్థి 24 ఓట్లు మెజార్టీ, 18 వ వార్డు పెడకండి రామకృష్ణ టిఆర్ఎస్ అభ్యర్థి 66 ఓట్లు మెజార్టీ, 19 వ వార్డు కంభంపాటి రాధ కాంగ్రెస్ పార్టీ 119 ఓట్లు మెజార్టీ, 20వ వార్డు గుండ్ల పుల్లారావు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 32 మెజార్టీ ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎన్నికల అధికారుల చేత మున్సిపాలిటీ ఎన్నికల్లో కౌన్సిలర్ అభ్యర్థులుగా గెలుపొందినట్లు అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. 16వ తేదీ సోమవారం చైర్మన్ ఎన్నిక జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ, ఏ ఆర్ ఓ ,మున్సిపాలిటీ కమిషనర్ రామదుర్గా రెడ్డి సబ్ కలెక్టర్అజయ్ యాదవ్, ఏసిపి వసుంధర యాదవ్, సిఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొని ఈ ఎన్నికలను విజయవంతం చేయడంలో విశేషమైన కృషి చేశారు ఎన్నికలకు ప్రత్యేకంగా సహకరించిన ఓటర్లకు ప్రజలకు అధికారులు ప్రత్యేకమైన ధన్యవాదములు తెలిపారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన మేయర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీరాం హీల్స్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మేయర్ పునుకొల్లు నీరజ శుక్రవారం పరిశీలించారు. అంతర్గత బిటి రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డిఈ నవీన్, ఎఈ అనిత, నాయకులు మందడపు మనోహర్‌రావు, శ్రీరాం హీల్స్ సొసైటీ అధ్యక్షురాలు సుజాతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సి స్టేట్ టాపర్‌కు 5 లక్షల బహుమతి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి, ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ స్టేట్ టాపర్ మార్కులు సాధించిన విద్యార్థులకు 5 లక్షల బహుమతి అందించానున్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహం ఇచ్చేందుకు ఈ ఏడాది బంపర్ బహుమతులు అందించానున్నారు. పెనుబల్లి మండలం వివిం బంజరు ప్రభుత్వ పాఠశాలలో శ్రీ రామ్ లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీ ప్రతినిధి ఇమ్మడి రామకృష్ణ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్సు ప్రతినిధులు సమావేశం అయ్యి తాము అందిస్తున్న ప్రోత్సహకాల పోస్టర్ ను ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు స్టేట్ టాపర్ గా నిలిచిన వారికి 5 లక్షల రూపాయలు బహుమతి, స్టేట్ రెండవ స్థానంలో నిలిచిన విద్యార్థులకు 3 లక్షల రూపాయలు బహుమతి, జిల్లా స్థాయిలో టాపర్ గా నిలిచిన విద్యార్థులకు 2 లక్షల రూపాయలు బహుమతి గా అందచేస్తున్నట్లు తెలిపారు. అలాగే తెలంగాణ లో ఉన్న 119 నియోజకవర్గాలలో ప్రతి నియోజక వర్గ టాపర్ కు లక్ష రూపాయలు మండల స్థాయిలో టాపర్ కు 10 వేల రూపాయలు నగదు బహుమతి అందచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిదులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహం ఇచ్చేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ పేద విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో శ్రీరామ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఏరియా మేనేజర్ సాయి కృష్ణ, బ్రాంచ్ మేనేజర్ బండి సతీష్, అసిస్టెంట్ మేనేజర్ తుమ్మల శంకర్, హెచ్ ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

## సీఎం కప్ వాలీబాల్ కేటగిరిలో స్టేట్‌కి ఎంపికైన అరుణోదయ విద్యార్థి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వియం బంజర అరునోదయ పాఠశాల కు చెందిన విద్యార్థి పత్రా ప్రేమ్ ఎంపిక అయినట్లు యాజమాన్యం శంకర్ తెలిపారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినందుకు గాను ప్రిన్సిపాల్ శంకర్ ఈ సందర్భంగా పత్రా ప్రేమ్‌ను అభినందించారు.

## బ్యాంకు సేవల భద్రతపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** మండల కేంద్రం ఎర్రుపాలెం డిసిసి బ్యాంక్ ఆవరణంలో బ్రాంచ్ మేనేజర్ నీలం దివ్య అధ్యక్షతన బ్యాంక్ వినియోదారులకు బ్యాంక్ సేవలు నగదు భద్రతపై శుక్రవారం సమావేశం జరిగింది. మధిర డిసిసి బ్యాంక్ నుంచి నాబార్డు ప్రతినిధి ఎఫ్ఎల్సీ నర్సింహారావు మాట్లాడుతూ కేవైసి, నకిలీ లింకులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ జనహితానికై వినియోగదారుల భద్రతను సూచనలుఇవ్వడం జరుగుతుందని తెలిపారు. బ్యాంక్ నగదుఉద్యోగిని మాట్లాడుతూ కొమ్మూరి మౌనిక కేవైసి అప్డేట్ చేసుకుని బ్యాంకు ప్రయోజనాలను పొందాలని కోరారు. అర్హత కలిగిన అన్ని వర్గాల వారికి అనేక రుణాలుఇచ్చి సహకరిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సూపర్వైజర్ వట్టికూటి సుధాకర్, సిబ్బంది వంగపూడి మురళీధర్, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టారు..

## -కాంగ్రెస్ కార్యాలయంలో సంబురాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించిన సందర్భంగా సంబురాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజా పాలన సాగిస్తూ పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టారని ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ముగ్గురు మంత్రుల పర్యవేక్షణలో కాంగ్రెస్ జోరు కొనసాగించిందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలే కాకుండా పట్టణ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో ఆధిపత్యం సాధించిందన్నారు. ఓటేసి గెలిపించిన ప్రజలకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ ఎంఎల్‌ఎ కొండబాల కోటేశ్వరరావు, పిసిసి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఆర్టిఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, కార్పొరేటర్లు, నాయకులు మిక్కిలినేని నరేంద్ర, కిలారి అనిల్‌కుమార్, కిలారి వెంకటరమణ, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజని కుమార్, బానాల లక్ష్మణ్, ప్రతిభారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో కాంగ్రెస్ విజయకేతనం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ కాంగ్రెస్ విజయకేతనం ఎగరవేసింది.. మొత్తం 23 వార్డులకు గానూ 17 వార్డుల్లో కాంగ్రెస్ విజయం సాధించి చైర్మన్ పీఠం దక్కించుకుంది. విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థులను శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతులు అభినందించారు..

### పోస్టల్ బ్యాలెట్స్ లోనూ కాంగ్రెస్ దే విజయం..

పోస్టల్ బ్యాలెట్స్ మొత్తం 112 కాగా 108 పోలయ్యాయి.. ఇందులో కాంగ్రెస్ కు 76, బీఆర్ఎస్ కు 25, బీజేపీ 02, మునిగిపోయిన ఓట్లు రెండు చొప్పున లభించాయి..

### విజేతలు వీరే....

విజయం సాధించిన అభ్యర్థుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. మట్టా ప్రసాద్ (1 వార్డు కాంగ్రెస్), వీరపనేని రాధిక (2వ వార్డు బీఆర్ఎస్), బొంతు సుమలత (3వ వార్డు, కాంగ్రెస్ ), ఎస్ కే మౌలాలి ( 4వ వార్డు, కాంగ్రెస్ ), షేక్ హకీమ్ (5వ వార్డు, కాంగ్రెస్), తోట సుజలరాణి (6వ వార్డు, కాంగ్రెస్), మహమ్మద్ నసీమా బేగం (7వ వార్డు, కాంగ్రెస్), బండారు శరత్ చంద్ర (8వ వార్డు కాంగ్రెస్ ), జగనాదం శ్రీను ( 9వ వార్డు, కాంగ్రెస్ ), మట్టా దేవజ్యోతి (10వ వార్డు,కాంగ్రెస్ ) జాన్ మహమ్మద్ మీర్జా ( 11వ వార్డు బీఆర్ఎస్ ), జొన్నలగడ్డ లత (12వ వార్డు, టిఆర్ఎస్ ), ఉప్పు నాగమణి ( 13వ వార్డు, కాంగ్రెస్ ), కూసంపూడి మహేష్ ( 14వ వార్డు,, బీఆర్ఎస్ ), దూదిపాల రాంబాబు (15వవార్డు, కాంగ్రెస్ ), జొన్నలగడ్డ శ్రీనివాసరావు (16వ వార్డు కాంగ్రెస్ ) కొత్తూరు తులసి( 17 వ వార్డు, బీఆర్ఎస్ ),, పరస మానస (18వ వార్డు, కాంగ్రెస్), కర్నాటి విజయ్ కుమారి (19వ వార్డు, కాంగ్రెస్), బెల్లంకొండ రాము (20వార్డు, బీఆర్ఎస్ ), మందపాటి ప్రభాకర్ రెడ్డి (21వ వార్డు కాంగ్రెస్), మహమ్మద్ రెహానా బేగం (22వ వార్డు, కాంగ్రెస్), విరివాడ అపర్ణ (23వ వార్డు, కాంగ్రెస్) చొప్పున విజయం సాధించారు.

# మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన వీర కాశీపట్నం శివాలయం





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు సమీపంలో ఉన్న శ్రీ వీర కాశీపట్నం విశాలాక్షి అన్నపూర్ణ సమేత ద్వాదశి జ్యోతిర్లింగ విశ్వేశ్వర స్వామి దేవస్థానం శివాలయం విద్యుత్ దీపాల అలంకరణతో ముస్తాబైనది. పిండిప్రోలు గ్రామంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ వీర కాశీపట్నం లో మహాశివరాత్రి వేడుకలను అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయ వ్యవస్థాపకులు వీర కాశి పట్నం పీఠాధిపతి దేవాలయ ధర్మకర్తలు చైర్మన్ పూజారి మడికంటి వీరభద్ర స్వామి సుగుణ (గురుమాత) మడి కంటి శంకర్ గురు స్వామి నాగమణి ధర్మపత్ని గార్లచే శివాలయం లో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వస్తిశ్రీ వ్యవహారిక చంద్ర మానేనా శ్రీ విశ్వవసునామా సంవత్సర మాఘ మాస బహుళ త్రయోదశి సంవత్సర ఫిబ్రవరి 15వ తేదీన ఆదివారం ఉదయం 3 గంటల నుండి 12 గం టల వరకు స్వామివారికి పంచామృత విశేష అభిషేకములు నిర్వహించబడుతుందని సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల ఉత్సవమూర్తుల కు పంచామృత అభిషేకాలు నిర్వహించబడుతుందని రాత్రి 8:30 గంటలకు శివపార్వతుల కళ్యాణం నిర్వహించబడుతుందని రాత్రి 12 గంటలకు లింగోద్భవ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఫిబ్రవరి శుక్రవారం ఉదయం 10 గంటలకు గణపతి పూజ పుణ్యావచనం రుద్రాభిషేకం రుద్ర హోమం నిర్వహించినట్లు వీర కాశీపట్నం పీఠాధిపతులు దేవాలయ ధర్మకర్తల చైర్మన్ మడి కంటి వీరభద్ర స్వామి, సుగుణమ్మ గురుమాత వీరి పుత్ర రత్నాలు మడికంటి శంకర్ గురు స్వామి, నాగమణి ధర్మపత్ని తెలిపారు కావున సమస్త భక్త మహాశయులు శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారు తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామివారి కృప పాత్రులు కాగలరని పూజా సామాగ్రి లడ్డు ప్రసాదం దేవాలయం నందు లభించబడును శివపార్వతుల కళ్యాణం లో పీటల మీద కూర్చుని దంపతులు దేవస్థానం నిర్వాహకులను సంప్రదించగలరు. దీనిలో భాగంగా మహాశివరాత్రి ఉత్సవాలను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త పూజారి మడి కంటి వీరభద్ర స్వామి కోరారు.

# అటవీశాఖలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి అటవీ రేంజ్ పరిధిలో పలు విస్తృతంగా పర్యటించి అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పిసిసిఎఫ్) డాక్టర్ సువర్ణ గురువారం శ్రీకారం చుట్టారు.సత్తుపల్లి టింబర్ డిపోలో అధికారిక సమావేశాల నిర్వహణ కోసం నిర్మించిన నూతన వీఐపీ గదిని ప్రారంభించారు. చంద్రయ్యపాలెం బీట్ పరిధిలో అడవుల రక్షణ, అగ్నిప్రమాదాల నివారణ లక్ష్యంగా ఏర్పాటు చేసిన వాచ్ టవర్‌ను ప్రారంభించి అక్కడి నుంచి అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. చంద్రయ్యపాలెం మండల ఉన్నత ప్రాథమిక పాఠశాలను సందర్శించిన అధికారులు అటవీ శాఖ నిధులతో చేపట్టిన భవన రంగుల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించి వారికి నోట్‌బుక్స్, పెన్లు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అడవుల ప్రాముఖ్యతను వివరించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అదే విధంగా వన సంరక్షణ సమితి సభ్యుల ఆరోగ్య అవసరాల కోసం ఏర్పాటు చేసిన కంటైనర్ ఆసుపత్రిని ప్రారంభించి, వారి ఆర్థికాభివృద్ధి కోసం అందజేసిన వాహనాలు, లీఫ్ ప్లేట్ల తయారీ యంత్రాలు, కాటన్ వత్తుల యూనిట్లు, తేనెటీగ పెట్టెల పనితీరును పరిశీలించి సభ్యులతో చర్చించారు. అనంతరం పిసిసిఎఫ్ డా. సువర్ణ మాట్లాడుతూ అడవుల పరిరక్షణలో వన సంరక్షణ సమితి సభ్యుల పాత్ర అమూల్యమైనది. ప్రజల భాగస్వామ్యం ఉంటేనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని తెలిపారు.సీసీఎఫ్ డా. భీమా నాయక్ మాట్లాడుతూ అటవీ రక్షణతో పాటు స్థానికులకు ఉపాధి కల్పించడమే మా లక్ష్యమన్నారు. విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అటవీ శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు.డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం, మరమ్మతులు, అటవీ ప్రాంత పిల్లల ఉన్నత చదువులకు సహాయం ద్వారా ప్రజలకు అటవీ శాఖ మరింత చేరువవుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎఫ్‌డీఓ మంజుల,ఎఫ్ ఆర్ ఓ స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ప్రారంభమైన రామనామ సప్తాహం



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లిలోని గురు మందిరంలో శుక్రవారం హరే రామ నామ సంకీర్తన సప్తహం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. సంకీర్తన ఆచార్యులు అవధూతేంద్ర సరస్వతి స్వామి మందిర 31వ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న సప్తహాలను భక్త మండలి అధ్యక్షులు గొట్టుపర్తి శివాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సరస్వతి స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవధాని భార్గవ శర్మ, సాయి రామకృష్ణ, బుజ్జయ్య, భక్త మండలి ప్రముఖులు కేశగాని వెంకటేశ్వర్లు, పోరండ్ల నెహ్రూ, హనుమంతరావు, సర్పంచ్ బుల్లి హరినాయక్, రాందాస్, శివాజీ, మహంకాళి, రాం నరసయ్య, సైదులు, శ్రీనివాస చారి, నాగయ్య, శివ కృష్ణ, మనోజ్, నాగేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో ప్రతీఒక్కరూ పాలుపంచుకోవాలి

## హైదరాబాద్ ట్రాఫిక్ డిప్యూటీ కమీషనర్ రామదాసు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గ్రామాభివృద్ధి లో ప్రతీ ఒక్కరూ పాలుపంచుకోవాలని హైదరాబాద్ ట్రాఫిక్ డిప్యూటీ కమీషనర్ తేజావత్ రామదాసు సూచించారు. మండలంలోని మంగాపురంతండా పంచాయతీ సర్పంచ్ ధీరావత్ అశోక్ రాణి, పాలక వర్గంను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంగా పురం తండా వాసి గా అభివృద్ధిలో తన వంతు భాగస్వామ్యం అవుతానని పేర్కొన్నారు. పుట్టిన గ్రామం ను అభివృద్ధి చేసుకోవటం కోసం ఎక్కడ ఉన్న వారంతా ఓకే తాటి పైకి రావాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన అవకాశం ను వినియోగించి గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెరువుమాధారం మత్స్య సోసైటీ ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, సోసైటీ మాజీ అధ్యక్షుడు బాలాజీ, మాజీ ఎంపీటీసీ తేజావత్ అరుణ, కోటేశ్వరరావు, రమణ, మోహన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# తెలుగు ఫోరంలో జిల్లా ప్రథమస్థానం సాధించిన మహేష్




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలుగు ఫోరం ఖమ్మం జిల్లా కమిటి ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన ప్రతిభాపాటవ పరీక్షలో నేలకొండపల్లి విద్యార్థి జిల్లా ప్రథమ స్థానం సాధించారు. శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి తెలుగు టాలెంట టెస్ట్ లో నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల కు చెందిన పదో తరగతి విద్యార్థి మహేష్ ప్రతిభ కనపరిచారు. మొదటి బహుమతి తో పాటు, రూ.5 వేల నగదు ను అందుకున్నారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపగాని రమేష్, తెలుగు టీచర్ లు ఎస్. నాగార్జున, ఆర్.మునీశ్రీ తదితరులు విద్యార్థిని అభినందించారు. ఘనంగా సన్మానించారు.